సాక్షి
కుమురం భీం
మంగళవారం ׀ 9 ׀ జూలై ׀ 2024

మహానేత వైఎస్సార్‌కు నివాళులు



మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో నివాళులర్పించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /26.2

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం



ఆనంద్‌రావు దంపతులను అభినందిస్తున్న ఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టుదలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో గత నెల 5 నుంచి 7 వరకు నిర్వహించిన 5 కిలోమీటర్ల వాకింగ్ ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌- 2024 టోర్నమెంట్‌లో పాల్గొన్న ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన వైరాగడే శకుంతల (రెండో ర్యాంకు), వైరగడే ఆనంద్‌రావు(ఐదో ర్యాంకు) దంపతులను సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో అభినందించారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పోటీల్లో రాణించడం గొప్ప విషయమన్నారు. పోలీసుశాఖ తరఫున వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ డ్రైవర్లు విధుల్లో మద్యం తాగితే చర్యలు

ఆసిఫాబాద్: విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్లు మద్యం తాగితే చర్యలు తప్పవని డీఎం విశ్వనాథ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 27న హైదరాబాద్ డ్యూటీకి వెళ్లిన నలుగురు డ్రైవర్లు అదేరోజు సాయంత్రం వారికి కేటాయించిన గదిలో మద్యం తాగారని తెలిపారు. అనుమానం రావడంతో అధికారులు పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్లు గుర్తించారని అన్నారు. అక్కడి అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు నలుగురు డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో ఇష్టానుసారంగా వ్యవహరించడం, ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే పరమావధిగా భావిస్తున్న ఆర్టీసీలో ఇలాంటి క్రమశిక్షణ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రయాణికులకు పదిశాతం రాయితీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్, హైదరాబాద్ మధ్య సూపర్ లగ్జరీ, లహరి బస్సుల్లో రానుపోను టికెట్ బుక్ చేసుకునే ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో పదిశాతం రాయితీ సౌకర్యం అందిస్తున్నట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ బుకింగ్ సెంటర్లలో టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మోడల్' హాస్టళ్లలో సీట్లు పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థినులకు హాస్టళ్లలో సీట్లు పెంచాలని సోమవారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లాలోని రెండు తెలంగాణ మోడల్ స్కూళ్లలో 500 మంది బాలికలు చదువుతున్నారని తెలిపారు. కేవలం వందమందికి మాత్రమే వసతి సౌకర్యం కల్పిస్తుండటంతో మిగితా వారు ఇళ్ల నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఎక్కువ మంది విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విలాస్, కోటేశ్వర్, హరిశ్చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న డీఐఈవో శంకర్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఐఈవో శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధిస్తే ఉన్నత చదువులకు మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి, ప్రవేశాల గురించి ప్రిన్సిపాల్ పరుశురాములును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులు డీఐఈవోను శాలువాతో సన్మానించారు.

నిధుల్లేక సాగని పనులు!

- ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ పంచాయతీలు
- వర్షాకాలంలో పనుల నిర్వహణకు తప్పని అవస్థలు
- పంచాయతీ కార్యదర్శులపై అదనపు భారం
- రాష్ట్ర, కేంద్ర నిధుల విడుదలలో జాప్యం



రెబ్బెన మండలం నారాయణపూర్ పంచాయతీ కార్యాలయం

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందాల్సిన నిధులు కొన్ని నెలలుగా విడుదల కాకపోవడంతో పాలన కష్టతరంగా మారింది. రోజువారీ పారిశుధ్య పనులకు మినహా ఇతర ఏ పని చేపట్టాలన్నా పంచాయతీ కార్యదర్శులు తంటాలు పడాల్సి వస్తోంది. పంచాయతీల్లో పాలన, అభివృద్ధి కుంటుపడుతోంది. కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేసే నిధులు సైతం కొన్ని నెలలుగా ఆగిపోయాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. దీంతో పంచాయతీల నిర్వహణకు కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

ఖాతాలు ఖాళీ

పంచాయతీల నిర్వహణ, గ్రామాల్లో అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ ద్వారా నిధులు, కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా.. కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వమే నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు బదిలీ చేస్తోంది. అయితే గత ఆరు నెలల నుంచి కేంద్ర ప్ర భుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధుల విడుదల పూర్తిగా నిలిచిపోయింది. రాష్ట్రప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులను సైతం గతేడాది మార్చి నుంచి విడుదల చేయడం లేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు నిధులు రాకపోడంతో చిన్నచిన్న సమస్యలను సైతం పరిష్కరించలేని దుస్థితి నెలకొంది. పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణతోపాటు ఈఎంఐలు కట్టలేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్ల మరమ్మతులు, సైడ్‌డ్రైన్‌ల మరమ్మతులు, వీధిదీపాల నిర్వహణ, పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమయ్యే మెటీరియల్స్ కొనుగోలు, పారిశుధ్య కార్మికుల జీతాలు, స్టేషనరీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్వహణతోపాటు రోడ్లకు మరమ్మతులు.. ఇతర అవసరాల కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తోంది. సర్పంచుల పదవీకాలం పూర్తయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. పంచాయతీ ల నిర్వహణపై ప్రత్యేకాధికారులు అంటీముట్టనట్లు ఉండడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది.

జనరల్ ఫండ్‌తో నెట్టుకొస్తూ

జిల్లాలో మొత్తం 334 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. జిల్లాలో ఆదాయం వచ్చే మేజర్ పంచాయతీలు తక్కువగా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న పంచాయతీలకు తీవ్రమైన నిధుల కొరత ఉంది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క పైసా కూడా విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోంది. పంచాయతీ కార్యదర్శులు జీతం డబ్బులతో పాలన నెట్టుకొస్తున్నారు. సుమారు రూ.20 నుంచి రూ.50 వేల వరకు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. కొన్ని మేజర్, పెద్ద గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు ఇతర ఆదాయ వనరుల ద్వారా జమయ్యే జనరల్ ఫండ్‌తో అవసరాలు తీరుస్తున్నారు. చిన్న పంచాయతీల్లో జనరల్ ఫండ్ సైతం ఉండదు. కనీసం జీపీ కార్మికులకు వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి ఉండదు. పంచాయతీ కార్మికులు సైతం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ససేమిరా అంటున్నారు. మరోవైపు పాలనలో లోటుపాట్లు రావొద్దంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఉండటంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రశ్నిస్తున్న కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేస్తున్నారని సమాచారం. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కొరత ఉంది

గ్రామ పంచాయతీలకు కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. పంచాయతీల్లో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. అయినా పంచాయతీ కార్యదర్శులు ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండానే రోజువారీ పనులు చేపడుతున్నారు. ఇంటి పన్నులు, ఇతర ఆదాయ వనరుల ద్వారా వచ్చే ఆదాయంతో పనులు జరుగుతున్నాయి. నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. త్వరలోనే నిధుల విడుదలయ్యే అవకాశం ఉంది. – భిక్షపతి, డీపీవో

వారసులకు ఉద్యోగావకాశం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న పూర్వ వీఆర్ఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: 60 ఏళ్ల పైబడిన పూర్వ వీఆర్ఏల వారసులకు జీవో నం.81, 85 ప్రకారం ఉద్యోగావకాశం కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు లోకేశ్‌తో కలిసి పూర్వ వీఆర్ఏలు సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లయంతో 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులు ఉద్యోగాలు పొందలేకపోయారని, రాష్ట్రవ్యాప్తంగా 3,797 మంది నష్టపోయారన్నారు. జిల్లాలో 57 మంది ఉద్యోగాలు పొందలేకపోయారని తెలిపారు. అదనపు కలెక్టర్ స్పందించి సీసీఎల్‌కు లిఖితపూర్వకంగా పంపిస్తామని, ప్రస్తుతం పని చేస్తున్న వారికి అధికారుల ఒత్తిడి లేకుండా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, అంకుల్, రజినీకాంత్, రాజం, సతీశ్, కిషోర్, గిర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 12 నుంచి సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం శిబిరాలకు వచ్చే వారు ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రాల్లో దివ్యాంగత్వ పరీక్ష చేయించుకుని స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత నిర్ణీత తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే శిబిరాలకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 12న మూగ, చెవిటి, 15న మానసిక వైకల్యం, 22న కంటిచూపు, 27, 30 తేదీల్లో ఎముకలకు సంబంధిత సమస్యలు ఉన్న వారు సదరం శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

వాగువద్ద వేచి చూస్తున్న మోతీపటార్ గ్రామస్తులు



జోరు వాన

ఆసిఫాబాద్/రెబ్బెన/లింగాపూర్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం జోరువాన కురిసింది. గంటకు పైగా కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. జిల్లాలో సోమవారం 9.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ పట్టణంలోని జుబ్లీ మార్కెట్ రహదారిపై వరద నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పైకాజీనగర్, పోచమ్మ వీధితోపాటు పలు కాలనీల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ఎగువన కురిసిన వర్షాలతో కుమురంభీం ప్రాజెక్టులోకి భారీగా వరద చేరింది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉండగా.. నీటి మట్టం 236.9 మీటర్లకు చేరింది. దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే గేట్లు ఎత్తుతామని ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. రెబ్బెన మండలంలో వాగులు జలకళను సంతరించుకున్నాయి. పులికుంటవాగు నిండుగా ప్రవహించింది. గోలేటి టౌన్‌షిప్‌లోని డీ టైప్ క్వార్టర్స్ నాలుగో లైన్‌లో శ్రావణ్‌కుమార్, అరుణ్‌కు చెందిన పెంకుటిల్లు వర్షానికి నేలమట్టమైంది. కొంతకాలంగా ఇంట్లో ఎవరూ నివాసం ఉండటం లేదు. వర్షానికి గోడలు తడిసి కూలిపోయాయి. లింగాపూర్ మండలం పిట్టగూడ, మోతీపటార్, ఖీమానాయక్ తండా ప్రజలు వర్షంతో రాకపోకలకు అవస్థలు పడ్డారు. మోతీపటార్ గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన పైనుంచి వరద ప్రవహించింది. మండల కేంద్రానికి సమీపంలో ప్రవహిస్తున్న పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించింది. పిట్టగూడ వద్ద పనులకు వెళ్లిన వారిని యువకులు తాడు సాయంతో వాగు దాటించారు. వర్షం పత్తి పంటకు జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పిట్టగూడ వద్ద వాగు దాటుతున్న ప్రజలు



గోలేటిలో వర్షానికి కూలిన పెంకుటిల్లు



నిండుగా ప్రవహిస్తున్న పులికుంటవాగు



జిల్లా కేంద్రంలోని జుబ్లీ మార్కెట్ రహదారిపై వర్షపు నీరు

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మృతి చెందిన తన భర్త పేరుతో ఉన్న అటవీహక్కు పత్రాన్ని తన పేరుపై మార్పిడి చేయాలని కెరమెరి మండలం గౌరి గ్రామానికి చెందిన జాదవ్ సావిత్రీబాయి దరఖాస్తు చేసుకుంది. తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టా పాస్‌పుస్తకం జారీ చేయాలని వాంకిడి మండలం ఖమానకు చెందిన రాజబోయిన రాజన్న కోరాడు. ఉపాధి కోసం చౌకధరల దుకాణం మంజూరు చేయాలని కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్‌కు చెందిన సుమిత్ర సర్కార్ దరఖాస్తు చేసుకుంది. చింతలమానెపల్లి మండలం డబ్బా శివారులో తన పట్టా భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, దీనిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని చాపిడి సోంబాయి వేడుకుంది. చేపల పెంపకం కోసం అన్ని అర్హతలున్న తనకు మహిళా శక్తి పథకం కింద ఆర్థికసాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం ఈదులవాడకు చెందిన గడ్డం మంజుల దరఖాస్తు చేసుకుంది. తన పట్టా భూమిలో కొందరు అక్రమంగా ఇల్లు నిర్మించుకుంటామని బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన దుగుట నానయ్య కోరాడు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన గోగర్ల రాజమ్మ గ్రామంలోని తన పట్టా భూమిలో రహదారి ఇవ్వాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయం చేయాలని కోరింది. ఎంపీహెచ్‌వో శిక్షణ పూర్తి చేసిన తనకు వైద్యారోగ్య శాఖ పరిధిలో ఉద్యోగం ఇప్పించాలని కాగజ్‌నగర్‌కు చెందిన మచ్చ రాజేశ్వరి దరఖాస్తు చేసుకుంది. వీరితో పాటు పలువురు సమస్యలపై కలెక్టర్‌కు ఏకరువు పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కాశబోయిన సురేశ్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశం కల్పించాలి




2012లో ఎంపీహెచ్ డబ్ల్యూ(ఎఫ్) ట్రైనింగ్ పూర్తి చేశాం. ఉద్యోగం లేక జీవనం కష్టంగా మారింది. ప్రభుత్వ హెల్త్ సెంటర్లలో ఎంపీహెచ్‌డబ్ల్యూగా ఉద్యోగావకాశం కల్పించాలి.
– మంథెన బాలమణి, సత్తమ్మ, కాగజ్‌నగర్

నిలిచిన పనులు.. రాకపోకలకు ఇబ్బందులు




ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లి వెళ్లే దారిలోని బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని అప్పపెల్లి గ్రామానికి చెందిన యాదగిరి చంద్రయ్య, చెన్నబోయిన తిరుపతి, బుడె నానాజీ, నలిగె సత్తయ్య, ప్రభాకర్, ప్రేంసాగర్ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. రూ.1.80 కోట్లతో బ్రిడ్జి మంజూరుగా కాగా.. నెల రోజుల క్రితం మంత్రి సీతక్క పనులు ప్రారంభించారని తెలిపారు. ఇటీవల పనులు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

నడవలేని స్థితిలో ఉన్నా..




మూడేళ్ల క్రితం పక్షవాతం రావడంతో కుడి కాలు, చేయి పని చేయడం లేదు. నడవలేని స్థితిలో ఉన్నా. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే ఆసరా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.
– దుర్గం శంకర్, చింతగూడ, మం.కాగజ్‌నగర్

వేరే వ్యక్తులకు పట్టా



తిర్యాణి మండలం బారెంగూడలో సర్వే నం.7లో 3.20 ఎకరాల భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. మా పట్టా భూమిని వేరే వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకున్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలి.
– అడె జంగు, బారెంగూడ, మం.తిర్యాణి

విరాసత్ చేయాలి



సిర్పూర్(టి) మండలం నవేగాంలో మా తండ్రి పేరుతో 2.10 ఎకరాల పట్టా భూమి ఉంది. అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. కుటుంబంలో నేను ఒక్కడినే వారసుడిని. తండ్రి పేరుతో ఉన్న భూమిని నా పేరుతో విరాసత్ చేయాలి.
– మావుల్‌కర్ మారుతి, నవేగాం, మం.సిర్పూర్(టి)

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- 'ఇంటింటా ఇన్నోవేటర్‌- 2024' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇంటింటా ఇన్నోవేటర్ - 2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి, ఆగస్టు 15న అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు ఒకరి చొప్పున యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఇన్నోవేషన్ మిత్రలుగా నియమిస్తుందన్నారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా 91006 78543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. ఆవిష్కర్త పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, చిరునామా, వంద పదాలతో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణకు సంబంధించిన 4 ఫొటోలు, రెండు వీడియోలు ఆగస్టు 3లోగా పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం గెర్రె సమీపంలో పాకల శంకర్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద మేత మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

గుట్కా పట్టివేత

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండల కేంద్రంలోని వసాకే ప్రకాశ్‌కు చెందిన పాన్ షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు షాపులో తనిఖీ చేయగా.. రూ.10,900 విలువైన గుట్కా ప్యాకెట్లు లభించినట్లు పేర్కొన్నారు. గుట్కా సీజ్ చేసి ప్రకాశ్‌తోపాటు ఆయనకు గుట్కా సరఫరా చేసిన హసన్ చావూష్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



హరికృష్ణ మృతదేహం

దండేపల్లి:మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన బోడకుంట హరికృష్ణ(22) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసిన హరికృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగితే పెళ్లి కాదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 6న దండేపల్లి సమీపంలో క్రిమిసంహారక మందు తా గాడు. ఈ విషయాన్ని స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతను కుటుంబ స భ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వేలానికి వ్యతిరేకంగా దీక్షలు

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు ప్రారంభం
- నేరుగా సింగరేణి సంస్థకే గనులు కేటాయించాలని డిమాండ్



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్:తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్ ప్రారంభించారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వేలానికి వ్యతిరేకంగా ఈ నెల 13 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని వివరించారు. తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్నందున సింగరేణిపై సానుకూలంగా వ్యవహరించాలన్నారు. గతంలో ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో బొగ్గు గనులను కేటాయించారన్నారు. అదే తరహాలో తెలంగాణలో కూడా గనులు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఫిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, సదానందం, సత్యనారాయణ, కామెర వేణు, నాయకులు మిర్యాల రాజేశ్వరరావు, సంపత్, మారుపెల్లి బాబు, కారుకూరి నగేశ్, లింగం రవి, మొగిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట నాయకులు దీక్ష చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ దీక్షను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పేరిట తెలంగాణలోని నూతన గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మల్లేశ్, లింగయ్య, సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, చిప్ప నర్సయ్య, మనోహర్, సత్యనారాయణ, బానయ్య, తిరుపతి పాల్గొన్నారు.

బొగ్గుబావులు దక్కేవరకూ పోరాడుదాం

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలోని బొగ్గు బావులు సింగరేణి సంస్థకు దక్కే వరకు పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ చేపడుతున్న దశలవారీ ఆందోళనల్లో భాగంగా సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ వేగంగా బొగ్గు బ్లాకులను వేలం వేయాలని చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపి, రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించని పక్షంతో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. దేశవ్యాప్త బొగ్గు గనుల సమ్మెకు కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, సీపీఐ మండల కార్యదర్శి జగ్గయ్య, జిల్లా వ్యవసాయ కార్యదర్శి నర్సయ్య, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, రాజేష్, కిరణ్, దివాకర్, శేషశయన రావు, ఓదెలు, అంజయ్య, రాజయ్య, గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు



గోలేటిలో నినాదాలు చేస్తున్న నాయకులు

సౌదీలో దండేపల్లి వాసి మృతి



మరణ వార్త తెలియడంతో విషాదంలో కుటుంబ సభ్యులు..

- ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలింపు..
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- అవయవదానంతో నలుగురు విదేశీయులకు పునర్జన్మ

దండేపల్లి:ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్(41)ఫిట్స్‌తో అక్కడ మృతిచెందాడు. ఈమేరు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వెంకటేశ్ ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న అతనికి ఈనెల 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం అర్ధరాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అతడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేశ్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బంధువులు కలిసి కోరారు.



మృతుడు వెంకటేశ్(ఫైల్)

గొప్పమనసు చాటుకున్నబాధిత కుటుంబం..

ఇదిలా ఉండగా వెంకటేశ్ కుటుంబం పెట్టెడు దుఃఖంలోనూ గొప్ప మనసు చాటుకుంది. దుబయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందడంతో అక్కడి ఆస్పత్రిలోని అవయవదాన ట్రస్టు సభ్యులు, వైద్యులు వెంకటేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అవయవదానం చేస్తే నలుగురికి కొత్త జీవితం ప్రసాదించినట్లు అవుతుందని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు వెంకటేశ్ కళ్లు, కిడ్నీలు దానం చేసేందుకు వెంకటేశ్ భార్య సరిత అనుమతి ఇచ్చింది. మరణించిన వెంకటేశ్ మరో అవయవదానం తో మరో నలుగురికి పునర్జన్మ ప్రసాదించాడు.

రెడ్, ఎల్లో కార్డ్ ఉత్తర్వులు రద్దు చేయాలి

బెల్లంపల్లి:కార్మికులపై క్రమశిక్షణ చర్యల కోసం సింగరేణి యాజమాన్యం రెడ్, ఎల్లో కార్డులు జారీ చేసేలా తెచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికులను ఇబ్బంది, భయభ్రాంతులకు గురిచేసే సర్క్యులర్లను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి యాజమాన్యం ఎల్లో , రెడ్‌కార్డ్ సర్క్యులర్లను తీసుకు రావడం కార్మిక వ్యతిరేకమైనదిగా పేర్కొన్నారు. సర్క్యులర్లు రద్దు చేసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ శాంతిఖని గని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ మంతెన రమేశ్, ఉపాధ్యక్షుడు బుర్క ప్రశాంత్, నాయకులు మిట్టపల్లి రమేశ్, వెంకటయ్య, సురేశ్, రమేశ్, ప్రవీణ్, రామకృష్ణ, గణేశ్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీరాంపూర్: కాలనీ వాసులకు పరిశుద్ధమైన తాగునీటిని అందించేందుకు నస్పూర్ షిర్కే చౌరస్తాలో సింగరేణి యాజమాన్యం రూ.10 లక్షతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ మూడు నెలలుగా పనిచేయలేదు. దీనిపై 'ఆర్వో వాటర్ ప్లాంట్‌కు మోక్షమెప్పుడో' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 3న కథనం ప్రచురితమైంది. దీనికి సింగరేణి అధికారులు స్పందించారు. జీఎం సంజీవరెడ్డి సంబంధిత సివిల్ అధికారులతో మరుసటి రోజే చర్చించారు. జాప్యంపై ఆరా తీసి వెంటనే ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సివిల్ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం జీఎం ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ వ్యాధులకు కలుషిత నీరు కూడా ఓ కారణమన్నారు. శుద్ధమైన నీటిని తాగాలని సూచించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభించేలా కృషి చేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఏవీ.రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవిందరావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చారిజ డీజీఎం సివిల్ రాము, ఈఈ సత్యనారాయణ, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, సీనియర్ పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్ షిర్కే చౌరస్తాలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

అనేవారు లేరని.. వినేవారూ లేరు..



ఖాళీ కుర్చీలు.. వచ్చిన ఆ కొందరు అధికారులు సెల్‌ఫోన్‌లో లీనం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉన్నతాధికారులు గోడు వెల్లబోసుకుంటేనైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా నలుమూలల నుంచి బాధితులు ప్రతీవారం కలెక్టరేట్‌కు వస్తున్నారు. సోమవారం కలెక్టర్ ఇతర విధుల్లో భాగంగా ప్రజావాణికి రాలేదు. దీంతో అదనపు కలెక్టర్ మోతిలాల్ 12 గంటల వరకు అర్జీలు స్వీకరించి ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో వివిధ శాఖల అధికారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉన్నవారు సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేస్తూ కనిపించారు. దీంతో ప్రజావాణికి వచ్చిన వారు తమ గడు ఎవరూ పట్టించుకోవడం లేదని చర్చించుకున్నారు.

ప్రశాంతంగా టీజీ ఎఫ్‌సెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజీ ఎఫ్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. కౌన్సెలింగ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 430మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

పోరుబాట కరపత్రాలు ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట ఈ నెల 19, 20 తేదీలలో నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. బీసీల డిమాండ్ల సాధనకు మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి లక్సెట్టిపేట ఉత్కూరు చౌరస్తా వరకు జరిగే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పోరుబాట కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కర్రె లచ్చన్న, జైపాల్ సింగ్, శ్రీపతి రాములు, శాఖాపురం భీంసేన్, భిక్షపతి, వేణుగోపాల్, చంద్రమౌళి, బండ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

మంచిర్యాలక్రైం: వరకట్నం వేధింపుల కేసుల్లో కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.నరేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన గుడి మోజేష్‌తో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన పల్లె రామస్వామి-నాగమ్మ దంపతుల కూతురు సరితతో 2005లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో సరిత తల్లిదండ్రులు రూ.3 లక్షలు నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం వీరి దాంపత్య జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలో కూతురు, కుమారుడు జన్మించారు. తర్వాత సరిత, మోజేష్ మధ్య గొడవలు మొదలయ్యాయి. మోజేష్‌తోపాటు అతని అన్న సాల్మాన్‌రాజ్, వదన ఏస్తేరు, తమ్ముళ్లు ఫిలిప్, కృపానందం సరితను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించారు. బాధితురాలు 2019లో ఫిర్యాదు చేయగా మోజేష్, సాల్మాన్‌రాజు, ఏస్తేరు, ఫిలిప్, కృపానాంద్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. నిందితులు కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కె.నిరోష నలుగురిపై ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ జారీ చేశారు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ ప్రత్యే సిబ్బంది వి.రాజేశ్, ఎంఏ.నిసార్ అహ్మద్, జి.రామేశ్వర్‌రావు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కృపానందం, ఫిలిప్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో లక్సెట్టిపేట జైలుకు తరలించారు. సాల్మాన్‌రాజ్, ఏస్తేరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 5 గనిలో నూతనంగా 2 ఎస్‌డీయల్ యంత్రాలను ప్రవేశపెట్టారు. జీఎం వాటిని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తిలో ఎస్‌డీయల్ యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను వీటి ద్వారానే సాధిస్తున్నామన్నారు. యంత్రాలకు ఎప్పటికప్పుడు మెయింటెనెన్స్ చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఏవీ.రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవిందరావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, రక్షణాధికారి శివయ్య, ఫిట్ ఇంజినీర్ రాధాకృష్ణ, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు పాల్గొన్నారు.



యంత్రాలు ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

గంజాయి క్రయవిక్రయాల కేసులో నిందితుల అరెస్టు

బెల్లంపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా అమ్మకం, కొనుగోలు చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన చేపట్టిన వాహనాల తనిఖీలో మందమర్రికి చెందిన రవితేజ అనే యువకుడు పట్టుబడగా అతడి వద్ద నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ కేసులో భాగస్వామి అయిన మందమర్రికి చెందిన మరో నిందితుడు మక్కల గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. తమకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన విశ్వదేవ్ మిస్త్రీ అనే వ్యక్తి గంజాయిని అమ్మాడని చెప్పడంతో చంద్రపూర్‌కు వెళ్లి నిందితుడు విశ్వదేవ్ మిస్త్రీని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇద్దరు నిందితుల వద్ద నుంచి 50గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని వెల్లడించారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై డి.రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సైలు

మహిళా న్యాయవాదిపై దాడి?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

బెల్లంపల్లి: భర్త ఉండి తప్పుడు సమాచారంతో ఒంటరి మహిళ ఫించన్ పొందుతూ ప్రభుత్వాన్ని మోసగిస్తోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై ఓ మహిళ దాడి చేసిందని బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ న్యాయవాది వీడియో విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిప్పరి విక్టోరియా అనే మహిళ బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో భర్త కరుణాకర్, పిల్లలతో నివాసం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఒంటరి మహిళ ఫించన్ తీసుకుంటుంది. ఈ మేరకు న్యాయవాది గాదవేణ మమత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ విషయంపై మాట్లాడుకుందామని రడగంబాల బస్తీలో ఉన్న హనుమాన్ ఆలయం వద్దకు రావాలని మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లిన తనపై మెప్మా ఆర్పీల సమక్షంతో విక్టోరియా, ఆమె కూతురు నందిని దాడి చేశారని, విక్టోరియా భర్త కరుణాకర్ తీవ్రంగా దూషించాడని మమత వీడియోలో ఆరోపించారు. తాను గర్భిణి అని కూడా చూడకుండా భౌతికంగా దాడి చేశారని కన్నీరు పెట్టుకుంది. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్ అండతో తనపై దాడిచేశారని తెలిపింది. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఓ పొదుపు సంఘంలో నిధుల దుర్వినియోగం జరగడంతో మమత తల్లి, ఆడబిడ్డపై ఏడాదిక్రితం చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ సైసై రమేశ్ తెలిపారు. ఈ విషయంలో కాంప్రమైజ్ కావాలని విక్టోరియాపై న్యాయవాది మమత ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుకునే క్రమంలో మాటామట పెరిగి వీడియో తీస్తున్న బాలికపై మమత చేయిచేసుకుందని చెప్పారు. దీతో విక్టోరియా, మమత పరస్పరం కొట్టుకున్నారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఇందారం ట్రాక్టర్ యజమానులపై ఫిర్యాదు

జైపూర్: మండలం ఇందారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులపై అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందారం సమీపంలో గల గోదావరి నది నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ల ఫొటోలు, వీడియోలను గ్రూపుల్లో పోస్టులు చేయగా ..పోస్టులు చేసిన యువకులపై, వారి ఇంటిపై దాడికి పాల్పడ్డారని యజమానులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. ఇందారం సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంపులను పోలీసులు సీజ్ చేసినట్లుగా తెలిసింది.

చిత్రం గీసి.. అభిమానం చాటి

తలమడుగు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటాడు తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గట్టు రాజు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆ మహానేతపై ఉన్న అభిమానంతో పెన్సిల్‌తో చిత్రాన్ని గీసినట్లు చిత్ర కారుడు రాజు తెలిపాడు.

